# కనువిప్పు

కోటరాధాకృష్ణమూర్తి

గడియారం ఆరు కొట్టింది. చదువుతున్న పుస్తకాన్ని విసుగ్గా షెల్ఫులోకి నెట్టి కిటికీ గుండా రోడ్డువైపు చూసింది సుజాత. రోడ్డు మీద జనం హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. రొద చేసుకుంటూ లారీలు బస్సులూ వెళ్తున్నాయి. సాయంత్రం ఆరింటికి తప్పకుండా ఇంటికొస్తానన్న తన భర్త డాక్టరు వేణు ఇంకారాలేదు. కనీసం వచ్చే సూచనలన్నా లేవు. గాఢంగా నిట్టూర్చి వంటింట్లోకి వెళ్లి ఓ గ్లాసు మంచినీళ్లు గొంతులో పోసుకొని సోఫాలో చతికిలబడింది సుజాత. షెల్ఫులోంచి మరో పుస్తకాన్ని బయటకి లాగి పేజీలు తిప్పింది. మనస్సు పుస్తకం మీద లగ్నంకావడంలేదు. పుస్తకాన్ని షెల్ఫులోకి నెట్టి గడియారంకేసి రెప్పార్పకుండా చూసింది. టిక్కు టిక్కు శబ్దంతో గడియారం తన విద్యుక్త ధర్మాన్ని తాను నెరవేరుస్తోంది. గోడమీద ఒక బల్లి ఇంకో బల్లికేసి చూస్తూ విచిత్రంగా చప్పుడు చేస్తున్నది.

గడియారం మరో అరగంట కొట్టింది వెక్కిరింపుగా. ఏదో ఆలోచిస్తూ కళ్లు మూసుకొన్నది సూజాత. బల్లమీద టెలిఫోన్ మోగింది.

''హలో''


'సుజా !' నర్సింగ్ హోము నుండి వేణు కంఠం ఆప్యాయంగా పలకరించింది ఫోన్లో.

''ఏమండీ ! సాయంత్రం ఆరింటికే వస్తానన్నారు. ఇంతసేపు మీ కోసం ఎదురు చూస్తున్నాను. మీరింకా బయల్దేరలేదా ఏమిటి ?''

క్షణకాలం విరామం.

''సారీ సుజా ! వెరీసారీ. సీరియస్ కేసొకటి అటెండవుతున్నాను. ఇంటికొచ్చాక వివరంగా చెప్తాను. నిన్ను నిరుత్సాహపరిచాను. ఎక్స్యూజ్ మీ.'' అవతలవైపు ఫోను పెట్టిన చప్పుడు.

అనుకున్నంతా అయింది. ఫోనును విసుగ్గా క్రెడిల్ మీద పెట్టి ఉస్సురంటూ మంచం



మీద మేను వాల్చింది సుజాత. గడియారం టిక్కు టిక్కు శబ్దం విసుగు పుట్టిస్తున్నది. కళ్లు మూసుకొని మళ్లీ ఆలోచనలో పడ్డది సుజాత. అవును గడియారానికీ, తన భర్తకూ అట్టే భేదం లేదు. వేణు కెప్పుడూ రోగులూ, రోగాలూ, మందుల గొడవే. ఇంటి విషయం పట్టించుకోడు. కాకపోతే ఏమిటి ? "బాబీ" సినిమా చూడాలని వారం రోజుల నుండీ తను ముచ్చట పడుతూంది. ఇదిగో అదిగో అంటూ ఏవేవో మాయ మాటలు చెప్తూ నెట్టుకొస్తున్నాడు వేణు. నర్సింగ్ హోముకు వెళ్లటానికి డ్రెస్ చేసుకుంటున్నప్పుడు భర్తను నిలదీసి అడిగింది.

"సరే సుజా ! సాయంత్రం ఆరింటికి తప్పకుండా వస్తాను. బాబూ నువ్వూ రెడీగా ఉండండి" అంటూ ప్రామిస్ చేసి వెళ్లిపోయాడు వేణు. వేణుకిష్టమని నీలంరంగు షిఫాను కట్టుకొని, తలనిండా మల్లెపూలు పెట్టుకొని ముస్తాబై ఎంతో ఉత్సాహంగా ఎదురు చూసింది కానీ ఏం లాభం ? తన ఉత్సాహమంతా పాడైంది. కట్టుకున్న షిఫాను చీర, తల్లో పెట్టుకొన్న మల్లెపూలూ రెండూ ఏకమై తనను వెక్కిరిస్తున్నాయి. వేణుమీద కొంచెం కోపం వచ్చింది సుజాతకు. ఏం మనిషి ? అనుకొన్నది మనసులో.

ఉయ్యాల్లో బాబు నిద్రలేచి గుక్కపట్టి ఏడుస్తున్నాడు. వెండిగిన్నెలో అన్నం కలుపుకొని బాబును భుజంమీది కెత్తుకొని డాబా మీదకు వెళ్ళింది సుజాత. ఆకాశంలో చంద్రుడు మబ్బు గుర్రాలమీద స్వారి చేస్తున్నాడు. వెన్నెల్లో చందమామను చూపిస్తూ బాబుకు గోరుముద్దలు తినిపిస్తూ డాబామీద అటూ ఇటూ పచార్లు చేయడం ప్రారంభించింది సుజాత.

"అమ్మా ! నాన్న" అంటూ మారాం మొదలు పెట్టాడు బాబు.

"నాన్నగారొస్తారు బాబూ పడుకోమ్మా. పడుకో" అంటూ బాబును బుజ్జగించింది సుజాత వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

ఇంటి గేటుదగ్గర కారాగిన చప్పుడు. డాబామెట్లుదిగి తలుపు తీసింది, సుజాత. వేణు హడావిడిగా ఇంట్లోకొచ్చాడు. వచ్చీ రావడంతోటే సుజాత భుజాలు పట్టుకొని ఊపుతూ "సారీ సుజా" అన్నాడు వేణు. సుజాత సమాధానం చెప్పలేదు. సుజాత మౌనాన్ని వేణు గమనించి కారణం ఊహించుకొని తనలో నవ్వుకున్నాడు.

నిద్రపోతున్న బాబును మంచం మీద పడుకోబెట్టి వంటగదిలోకి వెళ్ళింది సుజాత. టర్కీటవలు వొంటికి చుట్టుకొని స్నానాల గదిలోకి వెళ్లాడు వేణు. షవరు శబ్దానికి సన్నని ఈలపాట తోడైంది. సన్నగా నవ్వుకొని వంటగిన్నెలు ముందుపెట్టుకొని భర్త కోసం నిరీక్షిస్తూ కూర్చున్నది సుజాత. ఐదు నిముషాల్లో స్నానం పూర్తి చేసి వచ్చి కంచం ముందు కూర్చున్నాడు వేణు. కంచంలో అన్నమూ కూరలూ వడ్డించింది, సుజాత మౌనంగా.

రెండు నిముషాలు ఇద్దరి మధ్యా మాటల్లేవు.

"సుజా ! కోపమా ?" అన్నాడు వేణు జాలిగా.

"కోపమెందుకూ సినిమా చూడకపోతే ప్రాణాలు పోవులెండి"

"ఐయామ్ రియల్లీ సారీ. రేపు తప్పకుండా వెళ్దాం" అన్నాడు వేణు పులుసులో సొరకాయముక్క నములుతూ.

"ఏమండీ ! మిమ్మల్నొకటి అడగాలని వుంది"

"ఓ ! తప్పకుండా" భార్య ముఖంలోకి చూశాడు వేణు.

"మీరు ముందా సారీ పదాన్ని వొదిలి పెట్టాలి"

"వెరీ వెరీ సారీ"

"అదుగో మళ్ళీ"

ఇద్దరూ నవ్వుకున్నారు. భోజనాలయ్యాక తమలపాకులకు ఈనెలు తీస్తున్నప్పుడు చెప్పాడు వేణు. నర్సింగ్ హోంనుంచి ఇంటికి బయలుదేరినప్పుడు, అప్పులవాళ్ళ బాధ పడలేక నిద్రమాత్రలు మింగిన వ్యక్తి నెవరో మోసుకొచ్చారట. అతగాడి ప్రాణం కాపాడే సరికి తనకు తలప్రాణం తోక కొచ్చిందట. వేణు మాటలు వింటూ "ఊఁ" కొడుతూ కూర్చున్నది సుజాత. నర్సింగ్ హోముకు వెళ్లి పేషెంటును చూసి చిటికెలో వస్తానంటూ వెళ్లిపోయాడు వేణు. వెళ్తున్న భర్తను చూసి గాఢంగా నిట్టూర్పు వొదిలింది సుజాత.

నాలుగురోజులు గడిచాయి.

"ఏమండీ ! గుంటూరు నుంచి ఉత్తర మొచ్చింది. బుధవారము నాడు గృహప్రవేశ మట. తప్పకుండా మనల్ని రమ్మని మీ షడ్డకుడు గారు మరీ మరీ వ్రాశారు. పాపం ! శాంతనూ పిల్లల్ని చూసి చాలా రోజులైంది. మనం వెళ్లకపోతే వాళ్లు బాధ పడతారు. ఏమంటారు ?" అన్నది సుజాత రాత్రి నర్సింగ్ హోము నుంచి తిరిగొచ్చిన భర్తను చూసి.

ఉత్తరం చదివి వొక్క నిట్టూర్పు విడిచి సోఫాలో చతికిలబడ్డాడు వేణు.

"ఏమండీ ! అలా వున్నారేం ? వొంట్లో బాగాలేదా ఏమిటి ?"


"కాదు సుజా, నా వృత్తి ధర్మ నిర్వహణలో నీ ముద్దు ముచ్చట్లు తీర్చలేకపోతున్నాను. ఐయామ్ వెరిసారీ. కనకయ్యగారికి సడన్‌గా హార్టు ఎటాక్ వచ్చింది — చాలా ప్రమాదకరమైన కేసు. రేపు ప్రొద్దున వేలూరు తీసుకెళ్లాలను కుంటున్నాను. గుంటూరు రావడానికి నాకు వీలుండదు. పోనీ నువ్వెళ్లి రాకూడదూ ? అన్నాడు వేణు బాధతో.

సుజాత ముఖం ముడుచుకొంది. తన

## వేరార్యూ ! మైడియర్ !

ఏడాదైంది నీ వూసెత్త లేదు
మైడియర్ ! స్వరాజ్యమా !
నా ప్రియతమ స్వతంత్రమా !
ఎక్కడున్నావ్ ? వేరార్యూ ?
ఇవాళ వెతకాలనిపించింది నిన్ను
అమాయక 'జనా' లెన్నుకున్న
నిరంకుశత్వపు దాస్యంలోనా ?
కల్తీ రాజకీయాల విషపు
కోరల అంచుల చివరా ?
వేరార్యూ? ఎక్కడున్నావ్ ? !
నీ పుట్టినరోజు పండక్కి
కొత్త జెండా కొనలేను కాని
పాత జెండా ఉతికారేశాను
ఓపికున్నా లేకపోయినా ఇంటి
పై కప్పెక్కి ఎగరేశాను
ఎక్కడున్నా ఓసారి వచ్చి పలకరించిపో!
మళ్లీ ఏడాద్దాకా నీ వూసెత్తను.

— వీ రా జీ.




## కను విప్పు

చెల్లెలూ, పిల్లలతో నాలుగురోజులు సరదాగా గుంటూరులో గడుపుదామని తను ఎంతో ఆశపడింది. తన ఉత్సాహమంతా పాడుచేశాడు వేణు. బాధలో సుజాత మనసు వికలమైంది ఆకాశంలో అందని చందమామను అలాగే చూస్తూ కిటికీదగ్గర నిలబడిందామె.

"సుజా! కోపమా? అన్నాడు వేణు సుజాత చెంపల్ని చేత్తో తాకుతూ.

సుజాత కళ్లలో నీళ్లు నిండాయి.

చేతిని మెల్లగా విదిలించుకొని పడగ్గది లోకి వెళ్లిపోయిందామె.

మడత కుర్చీలో కూర్చొని సిగరెట్టు పీలుస్తూ ఆలోచనలలో మునిగిపోయాడు వేణు.

తెల్లారికట్ల కనకయ్య గారితో కారులో వేలూరు వెళ్లిపోయాడు వేణు.

పగలంతా ఏదో నవల చదువుతూ, బాబును ఆడిస్తూ పొద్దుపుచ్చింది సుజాత.

సాయంత్రం బాబుకు పాలుపట్టి ఉయ్యాలలో పడుకోబెట్టి ఊచడం మొదలుపెట్టింది సుజాత హఠాత్తుగా నోట చొంగ కారుస్తూ కాళ్లూ చేతులూ గిల గిల కొట్టుకున్నాడు బాబు.

బాబూ! నా తండ్రీ అంటూ బిడ్డను భుజంమీద కెత్తుకొని ఫోను దగ్గరకు పరిగెత్తింది సుజాత ఫోను పనిచేయడంలేదు. ఏంచేయడానికి తోచడంలేదు వరండాలో కూర్చుని కునికిపాట్లు పడుతున్న పని మనిషిని కేకేసి రిక్షాను పిలవమంది. రెండు నిముషాల్లో రిక్షా వచ్చింది. బాబును భుజంమీద పడుకోబెట్టి గాంధీనగర్‌లో ప్రాక్టీసు చేస్తున్న డాక్టరు వెంకట్రామయ్యగారి దగ్గరకు వెళ్ళింది సుజాత. వెంకట్రామయ్యగారు కుటుంబంతో సహా అప్పుడే ఎక్కడికో బయల్దేర బోతున్నారు

"బాబాయ్ నాబిడ్డప్రాణాలు కాపాడండి" అంటూ బాబును వెంకట్రామయ్యగారికి అందించింది. ప్రయాణం మానుకొని వెంకట్రామయ్యగారు డిస్పెన్సరీ తలుపు తెరిచారు. బాబును పరీక్షచేసి "ఇది చంటిబిడ్డ చేష్టమ్మా. సామాన్యంగా చిన్నపిల్లలకు వస్తుంది. నీవు అధైర్యపడకు" అంటూ ట్రీట్‌మెంట్ ప్రారంభించారు

"బాబాయ్! బాబు నాన్నగారు వేలూరు వెళ్ళారు. ట్రంక్‌కాల్ చేస్తాను" అన్నది సుజాత వొణుకుతున్న కంఠంతో.

"కంగారు పడకమ్మా నీబిడ్డ కొచ్చిన ప్రమాదమేమీ లేదు వేణు అసలే మేధకుడు. వొట్టి కంగారు మనిషి నింపాదిగా విషయం తెలపొచ్చు" అన్నారు వెంకట్రామయ్యగారు చిరునవ్వు నవ్వుతూ

"బాబాయ్! మీరెక్కడికో ప్రయాణమవుతున్నారు" అంటూ అర్ధోక్తిలో ఆగిపోయింది సుజాత.

"ఫర్వాలేదమ్మా! నా వృత్తి ధర్మం నేను నిర్వర్తించాను. నీబిడ్డ ప్రాణంకంటే బంధువులింట్లో పెళ్ళినాకు ముఖ్యం కాదు."

సజల నయనాలతో ఆవృద్ధ మూర్తి వంక చూసింది సుజాత. తనబిడ్డ ప్రాణదాతకు మనస్సులోనే జోహార్లర్పించింది సుజాత

రాత్రి పదిగంటలకు స్పృహ వచ్చింది బాబుకు. కళ్ళు తెరిచి చూసి తల్లిని గుర్తుపట్టి "అమ్మా" అంటూ చేతులు చాపాడు.

"నా తండ్రే! నా నాయనే!" అంటూ బాబును గాఢంగా హృదయానికి హత్తుకొని బుగ్గలమీద ముద్దుల వర్షం కురిపించింది సుజాత.

"ఇంకేం ఫర్వాలేదమ్మా గండం గడిచింది" అన్నారు బాబు వీపునిమురుతూ వెంకట్రామయ్యగారు. అశ్రుపూరిత నయనాలతో ఆయన పాదాలకు నమస్కరించి కారులో ఇంటికి బయల్దేరింది కారులో ఇంటికి తిరిగి వస్తున్నపుడు ఏదో అవ్యక్తానందంలో సుజాత హృదయం నిండిపోయింది. ఇన్నాళ్ళు నుంచీ మనస్సు నావరించుకొన్న సందేహ మేఘాలు ఏదో మహాప్రభంజనం తాకిడికి పటాపంచలయినట్లు అనిపించింది. కారుశబ్దంలో పాటు "సుజా" అన్న తీయని పిలుపు చెవులకు సోకి శరీరం పులకించింది. అవును. ఇంటి విషయం పట్టించుకోవడం లేదనీ, తన సరదాలూ ముచ్చట్లూ తీర్చడం లేదనీ ఎన్నోసార్లు భర్తమీద చిరుకోపం ప్రదర్శించింది తను. కానీ సంఘశ్రేయస్సుతో సరిపోల్చి చూసినప్పుడు మన స్వార్థం విలువ ఏపాటి? "బాబూ! నాబిడ్డను కాపాడండి" అంటూ హాస్పిటల్‌కు వచ్చే ఎంతమంది కన్నీళ్లు తుడిచి పసిబిడ్డలకు ప్రాణదానం చేసాడో వేణు అంతదూర మెందుకు వెంకట్రామయ్యగారు పెళ్లి ప్రయాణం కూడా మానుకొని తన బిడ్డకు ప్రాణదానం చేశారు కదా. ఆయన స్వార్థం ప్రదర్శించి ఉంటే బాబు ప్రాణాలు దక్కి ఉండేవా? విద్యుక్త ధర్మ నిర్వహణలో ఉన్న సూక్ష్మమంతే. ఛీ! ఛీ! ఇకముందెన్నడూ వేణుకు ఎలాంటి ఆటంకమూ కలుగజెయ్యకూడదు ఎంత పొరబాటుగా వేణు నర్థచేసుకొంది తను. ఎంత పొరపాటెంత పొరపాటు.

కారు ఇల్లు చేరుకొంది. వెంకట్రామయ్యగారి డ్రైవరుకు థాంక్సు చెప్పి ఇంటి తలుపు తీసి స్విచ్ నొక్కింది సుజాత. చీకట్లను చిన్నాభిన్నం చేసుకుంటూ ప్రకాశవంతంగా దీపం వెలిగింది.